ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM
# నేటి దర్శిని
PRGI NO: APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777

విజయవాడ శుక్రవారం 2-10-2026 సంపుటి: 02 సంచిక : 92 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని
Vijayawada Friday, 2-10-2026 Volume :02 Issue:92 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani



## సెప్టెంబర్‌లోనూ యూపీఐ హవా..

- 24 బిలియన్లు దాటిన లావాదేవీలు
- ఏడాదిలో 23 శాతం పెరిగిన యూపీఐ లావాదేవీలు
- సెప్టెంబర్‌లో 24.07 బిలియన్ల ట్రాన్సాక్షన్లు
- లావాదేవీల విలువ రూ.29.37 లక్షల కోట్లు
- రోజుకు సగటున 802 మిలియన్ల లావాదేవీలు
- ఆగస్టుతో పోలిస్తే స్వల్పంగా తగ్గిన లావాదేవీలు
- రూ.2,000 దాటిన మర్చంట్ యూపీఐపై ని 0.4 శాతం ఎండీఆర్ ప్రతిపాదన
- వ్యాపార సంఘాల నిరసనతో కేంద్రంతో చర్చలు
- చిన్న వ్యాపారులకు ఎండీఆర్ నుంచి మినహాయింపు

న్యూఢిల్లీ,
దేశంలో 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ' తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. సెప్టెంబర్ నెలలో కూడా యూపీఐ లావాదేవీలు పెద్ద సంఖ్యలో నమోదయ్యాయి. 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. సెప్టెంబర్ నెలలో యూపీఐ లావాదేవీల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 23 శాతం పెరిగి 24.07 బిలియన్లకు చేరుకుంది. ఇక లావాదేవీల విలువ -మిగతా 2 లో

## స్థానిక పోరుకు
# గ్రీన్ సిగ్నల్

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ చెల్లదంటూ జీవోలు రద్దు

- ఎన్నికల నిర్వహణపై దాఖలైన అన్ని వ్యాజ్యాలు కొట్టివేత
- ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తికి ఎస్ఈసీకి ఆదేశం
- హైకోర్టు తీర్పుతో తొలగిన అడ్డంకులు
- ఎన్నికల నిర్వహణకు సిద్ధమన్న ఎస్ఈసీ పునేఠా

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను కొట్టివేసిన ధర్మాసనం.. ఎన్నికల నిర్వహణపై దాఖలైన పలు వ్యాజ్యాలను కొట్టివేస్తూ ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోందన్న కారణంతో ఎన్నికలను వాయిదా వేయడం సరికాదని స్పష్టం చేసింది. బీసీ జనగణన, వార్డుల పునర్విభజన, గ్రామాల విలీనం వంటి అంశాలపై దాఖలైన పిటిషన్లపైనా హైకోర్టు స్పష్టత ఇచ్చింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

02





## అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోన్న కమల దళం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్య టనలు

హైదరాబాద్,
తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్య టనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళిలతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరు గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది.

-మిగతా 2 లో

## సీఈసీ రాజీనామా
# చేయాల్సిందే

- లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక
- నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
- శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ
- సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్



02

## కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

- వాహనాలు ఆగకుండానే చెల్లింపులు
- తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజాలో కొత్త విధానం
- బ్యారియర్లు లేకుండానే వాహనాల రాకపోకలు
- ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్ చెల్లింపు
- ఏఎన్‌పీఆర్ కెమెరాలతో వాహన నంబర్ గుర్తింపు
- ఓవర్‌హెడ్ పరికరాలతో ఫాస్టాగ్ స్కానింగ్
- వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
- భారీ క్యూలు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
- త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం



02

## బీసీలకు అండగా నిలిచింది..
# నిలిచేది మేమే

బీసీ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీయే అడ్డంకి



- బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి రక్షణ
- బీసీల సామాజిక, ఆర్థిక సాధికారతే లక్ష్యం
- పేదల జీవన ప్రమాణాల పెంపునకు పెద్దపీట
- పింఛన్ల పంపిణీతో పేదలకు ఆర్థిక భరోసా
- సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం
- రూ.లక్ష కోట్లతో రాయలసీమలో ఉద్యాన విప్లవం
- సూర్యలంకను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో రాష్ట్ర పునర్నిర్మాణం
- పల్లె సభలో చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు

పోర్టులు, హార్బర్లు, ఎయిర్‌పోర్టులు పూర్తి చేస్తున్నాం. రాయలసీమను రతనాలసీమ చేస్తామని చెప్పాం చేసి చూపిస్తున్నాం. సిమెంట్ రోడ్లు వేస్తాం, పంచాయతీ రోడ్లు బాగు చేస్తాం. గత ప్రభుత్వం గుంతలు తవ్వింది, మేము పూడుస్తున్నాం. ఎక్కడైనా గుంతలు కనిపిస్తే అధికారులే బాధ్యత వహించాలి. ఎక్కడ చూసినా గుంతలు లేని రహదారులు కనపడాలి. అత్యవసరం కింద రోడ్డు డాక్టర్లను తీసుకుంటున్నాం. రోడ్డుపై గుంతలు కనిపిస్తే వెంటనే పూడ్చేలా ఏర్పాట్లు.సంక్షేమంతో సామాజిక భద్రత, అభివృద్ధిలో సంపద సృష్టి సాధ్యం. సుపరిపాలనతో నాణ్యమైన, మెరుగైన జీవితం తథ్యం. అభివృద్ధిలో పోటీతత్వం ఉండాలి, కుట్రలు కాదు.
--- ముఖ్యమంత్రి చంద్రబాబు

బాపట్ల,
బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది కూటమి ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్తామని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక భద్రత, ఆర్థిక సాధికారత కల్పించడంలో ఎక్కడా రాజీపడమని స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా రేపల్లెలో 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక -మిగతా 2 లో



02

## ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తక్కువే

- ప్రకటించిన భారత వాతావరణ కేంద్రం
- అక్టోబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- చలికాలంలోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం
- అక్టోబర్--డిసెంబర్‌లో తక్కువ వర్షపాతం
- తెలంగాణలో 18 శాతం లోటు వర్షపాతం
- 19 జిల్లాల్లో లోటు.. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం
- నల్గొండ, నిర్మల్‌లో అత్యధిక వర్షపాతం లోటు
- కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాలలో అధిక వర్షపాతం
- ఎల్నినో ప్రభావం శీతాకాలంపైనా ఉంటుందన్న ఐఎండీ



## నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్

- పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' అమలు చేయండి
- డ్రాప్ అవుట్స్ పై సింగపూర్ మంత్రి షణ్ముగం సూచనను పరిగణలోకి తీసుకోండి
- ఏయూ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖలో ప్రతిష్ఠాత్మక గ్రంథాలయ నిర్మాణం
- విద్యాశాఖ అధికారులతో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమీక్ష

, ఏపీ బ్యూరో:
నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ గురువారం సమీక్ష నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు

-మిగతా 2 లో

# శభాష్ స్మిత్

## భారత్ కీర్తి రెపరెపలు

- భారతీయ పైలట్ మచ్చర్కు ప్రశంసల వెల్లువ
- భారత్ గర్విస్తోంది: ప్రధాని మోడీ
- అసలైన హీరో: నెతన్యాహు శాల్యూట్
- రియల్ హీరో: ట్రంప్ ప్రశంసలు
- రాష్ట్రపతి ముర్ము నుంచి రాజ్నాథ్, జైశంకర్ వరకు అభినందనలు

పై దుబాయ్ విమానంలో కోపైలట్ జరిపిన దాడిలోతీవ్రంగాగాయపడినప్పటికీ ప్రయాణికుల రక్షణ కోసం తన ప్రాణాలను రిస్క్‌లో పెట్టిన భారతీయ పైలట్ స్మిత్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ఆయనను రియల్ హీరోగా ప్రపంచాధినేతలు అభివర్ణించారు. మెరుగైన చికిత్స కోసం స్మిత్‌ను యుఎఇకి తరలించారు.
విమానం కూల్చడానికి ఒమన్ కు చెందిన కోపైలట్ ప్రయత్నించాడంటూ వార్తలు వెలువడుతున్నాయి. అతడిని ఓ మత ఛాందసవాదిగా ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు పేర్కొన్నారు.



02

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే..

-లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
-సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక
-నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
-శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ
-సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్



న్యూఢిల్లీ,
ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ద్వారా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ లు ముంబైలో నిరసనకు సిద్ధమయ్యారు. రేనేడు సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ కార్యక్రమం చేపట్టబోతున్నారు. సీఈసీని వెంటనే తప్పించి, అరెస్టు చేయాలని కాక్రోచ్ లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో మహా సర్కార్ ఈ నిరసనను అడ్డుకునేందుకు సిద్ధమవుతోంది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, 3 డిమాండ్లను ముందుకు తెస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దిప్కే వెల్లడించారు. ఇందులో మొదటిది జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి, ఆదేశాలు ఎవరు ఇచ్చారో వెల్లడించాలి. అలాగే రెండవది ఎస్ఐఆర్ ను నిలిపివేయాలి, జనవరి 2025 ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి, స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. మూడో డిమాండ్ 2023 ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టాన్ని రద్దు చేసి, పౌర సమాజ భాగస్వామ్యంతో పారదర్శక చట్టాన్ని తీసుకురావాలి. వారు తమకు నచ్చిన వారిని కేవలం నిర్ణయించి ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కేంద్రాన్ని ఉద్దేశించి అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. ఈ పదవిలో ఎవరు ఉంటారనే దానిపై 150 కోట్ల మంది జీవితాలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా ఉండాలని దిప్కే కోరారు. ఎస్ఐఆర్ కు ముందే, ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్ఐఆర్ జాబితా ప్రకారం ఎన్నికలు జరిగితే, ప్రధాని మోదీ అమెరికాలో కూడా గెలవగలరని దిప్కే ఎద్దేవా చేశారు. మరోవైపు శివాజీ పార్క్ వద్ద రేపటి కాక్రోచ్ ల ఆందోళనలకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. స్థానికుల ఆందోళనలను ఇందుకు సాకుగా చూపింది. దీనిపై స్పందించిన దిప్కే.. తాము ఎట్టి పరిస్థితుల్లో జైల్ భరోకు దిగుతామని, చేతనైతే అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

# ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తక్కువే



న్యూఢిల్లీ,
వర్షాకాలం ముగిసి నేటితో శీతాకాలం ప్రారంభమైంది. ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ నెలలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ విడుదల చేసిన శీతాకాలం బులెటిన్లో పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎల్నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 18 శాతం లోటు వర్షపాతం నెలకొన్నట్లు తేల్చింది. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొన్నట్లు తేలింది. అత్యధిక లోటు వర్షపాతం ఉన్న జిల్లాలుగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్గిరి నమోదయ్యాయి. కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో సాధారణం కన్నా అత్యధిక వర్షపాతం నమోదైంది. తెలంగాణపై ప్రభావం చూపేలా ఏడు అల్పపీడనాలు ఏర్పడగా అందులో ఆరు వాయుగుండాలు, మూడు తీవ్ర వాయుగుండాలుగా మారి ఈ వర్షపాతానికి కారణమయ్యాయి. జూన్ మాసంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడంతో లోటు వర్షపాతానికి దారి తీసినట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈసారి భారత్లోకి నైరుతి రుతుపవనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. తెలంగాణలోకి సరైన సమయంలోనే అంటే జూన్ 8న ప్రవేశించినప్పటికీ వారం రోజుల పాటు దక్షిణ తెలంగాణ జిల్లా అయిన జోగులాంబ గద్వాల ప్రాంతంలోనే ఆగిపోయాయి. వారం రోజుల తరువాత మందకోడిగా ముందుకు కదిలి పదిహేను రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ఏడు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. ఈ అల్పపీడనాలు ఆరు వాయుగుండాలుగా మారాయి.

# సెప్టెంబర్‌లోనూ యూపీఐ హవా..

(మొదటి తరువాయి)

18 శాతం వృద్ధితో రూ.29.37 లక్షల కోట్లుగా నమోదైంది. సెప్టెంబర్‌లో ప్రతిరోజూ సగటున 802 మిలియన్ల లావాదేవీలు జరుగగా వాటి విలువ సుమారు రూ.97,913 కోట్లుగా ఉంది. ఆగస్టు నెలలో నమోదైన 24.51 బిలియన్ల లావాదేవీలతో పోలిస్తే సెప్టెంబర్‌లో స్వల్ప తగ్గుదల కనిపించినా వార్షిక వృద్ధి మాత్రం బలంగా కొనసాగుతున్నది. ఇదే సమయంలో ఐఎంపీఎస్ ద్వారా జరిగిన లావాదేవీల విలువ కూడా 18 శాతం పెరిగి రూ.7.06 లక్షల కోట్లకు చేరింది. ఇదిలావుంటే రూ.2,000 దాటిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ ' విధించాలన్న ప్రతిపాదనను వ్యాపారవర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్ర సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం చిన్న, మధ్యతరహా వ్యాపారులపై భారం మోపుతుందని, డిజిటల్ చెల్లింపుల స్వీకరణను దెబ్బతీస్తుందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. దీనికి నిరసనగా అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య సహా పలు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో చాందినీ చౌక్ ఎంపీ, సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ నేతృత్వంలోని సుమారు 20 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైంది. ఈ భేటీ తర్వాత వ్యాపార సంఘాలు తమ నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి. ప్రభుత్వం ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ కొత్త ఛార్జీల విధానం కేవలం రూ.2,000 మించిన మర్చంట్ (పీ2పీ) లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. దేశంలో జరిగే మొత్తం యూపీఐ మర్చంట్ లావాదేవీలలో 96 శాతానికిపైగా రూ.2,000 లోపే ఉంటున్నాయని, కాబట్టి అత్యధిక శాతం లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని వివరించింది. అంతేగాక నెలవారీగా రూ.1 లక్షవరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టంచేసింది.

# నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్

(మొదటి తరువాయి)

ఇచ్చే వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని లోకేశ్ అన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రిక్రూట్ మెంట్ మోడల్ ను ఆసక్తిగా గమనిస్తోంది. మనం అనుసరిస్తున్న విధానాలనే ఇతర రాష్ట్రాలు అనుసరించే అవకాశం ఉందని తెలిపారు.
రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బడి మానేసే (స్కూల్ డ్రాపౌట్) పిల్లలు భవిష్యత్తులో మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడటం, అనేక సామాజిక సమస్యలకు దారితీస్తున్నట్లు ఇటీవల తిరుపతి వచ్చిన సింగపూర్ హోం మంత్రి షణ్ముగం చెప్పారని, ఈ అంశాన్ని అధికారులంతా గమనంలోకి తీసుకోవాలన్నారు.
జీరో డ్రాప్ అవుట్ మిషన్ చేపట్టాలి
డ్రాప్ అవుట్స్ నివారణలో కమ్యూనిటీ లీడర్లను భాగస్వాములను చేసి 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. యువత చెడు దారి పట్టకుండా ఇప్పటికే 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి ప్రచార కార్యక్రమాలను పెద్దఎత్తున అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన నిడమర్రు స్కూల్ సందర్శనకు త్వరలో సింగపూర్ మంత్రి షణ్ముగం ను ఆహ్వానిస్తామని చెప్పారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 స్కూళ్లను గుర్తించి, 'లీడ్ స్కూల్స్'గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. విద్యాశాఖలో రాష్ట్రపతి ఉత్తర్వులు - 2025 అమలు విధివిధానాలపై సమీక్షించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో క్యాంపస్ ల ఏర్పాటుకు జేవీఎస్ఎస్, థాపర్, యూపీఈఎస్, జేయూఎస్, బెన్నెట్, సవిత యూనివర్సిటీల వంటివి ఆసక్తి చూపుతున్నాయని అధికారులు తెలిపారు.

# కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

-వాహనాలు ఆగకుండానే చెల్లింపులు
-తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజాలో కొత్త విధానం
-బ్యారియర్లు లేకుండానే వాహనాల రాకపోకలు
-ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్ చెల్లింపు
-ఏఎన్‌పీఆర్ కెమెరాలతో వాహన నంబర్ గుర్తింపు
-ఓవర్‌హెడ్ పరికరాలతో ఫాస్టాగ్ స్కానింగ్
-వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
-భారీ క్యూలు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
-త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం




ఎంత ఫాస్టాగ్ వాడుతున్నా టోల్ ప్లాజాల దగ్గర కొన్ని క్షణాలపాటైనా ఆగాల్సిందే. టోల్‌ప్లాజాల దగ్గర చెల్లింపుల సమయంలో వాహనాలు ఆగేందుకు బ్యారియర్లు ఉంటాయి. అయితే, తమిళనాడులో అసలు వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండానే చెల్లింపులు చేయవచ్చు. టోల్‌ప్లాజా దగ్గర బ్యారియర్లు కూడా తీసేశారు. ఇది తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజా వద్ద అమలవుతున్న కొత్త టెక్నాలజీ వ్యవస్థ. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందితమిళనాడులోని తాంబరం-టిండివనం పట్టణాల మధ్య గల పరనూర్ వద్ద 45వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాలో ఈ విధానం అమలవుతోంది. ఇది 46.5 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారి. అక్టోబర్ 1, గురువారం నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడి టోల్‌ప్లాజాను మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) కింద అభివృద్ధి చేయడంతో ఈ టోల్‌ప్లాజా దగ్గర వాహనాలు ఆగకుండా నేరుగా వెళ్లిపోవచ్చు. అయితే, ఇదే మొదటి బ్యారియర్ ఫ్రీ టోల్‌ప్లాజా కాదు. ఇంతకుముందు ముంబై నేషనల్ హైవే 48పై, సూరత్-భరూచ్ మధ్య కామ్రేజ్-చోర్యాసి మధ్య ఉన్న టోల్‌ప్లాజాలో గత మే నుంచే ఈ విధానం అమలవుతోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఇతర టోల్‌ప్లాజాలకు కూడా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. వాహనాలన్నీ ఫాస్టాగ్‌తో లింకై ఉంటాయన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ఫాస్టాగ్‌ను రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీతో అనుసంధానం చేశారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ టెక్నాలజీ ద్వారా ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్.. ఫాస్టాగ్‌ను గుర్తిస్తుంది. అలాగే, కెమెరాలు వాహన రిజిస్ట్రేషన్ నెంబర్‌ను గుర్తిస్తాయి. ఈ ఫాస్టాగ్, వాహన నెంబర్ ఆధారంగా ఆటోమేటిగ్గా చెల్లింపు జరిగిపోతుంది. దీంతో వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోవచ్చు. అయితే, ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉండటం తప్పనిసరి. టోల్‌ప్లాజాల దగ్గర వాహనాల భారీ క్యూలైన్లు, నెమ్మదిగా కదిలే పరిస్థితిని తగ్గించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఈ విధానాన్ని ప్రవేశపెడుతోంది.

# బీసీలకు అండగా నిలిచింది.. నిలిచేది మేమే

(మొదటి తరువాయి)

సభలో సీఎం మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో బీసీలకు రాజకీయంగా గుర్తింపు లభించిందని, తాను కూడా బీసీలకు అండగా నిలుస్తున్నానని చెప్పారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను తగ్గించిందని సీఎం విమర్శించారు. రిజర్వేషన్లు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం, దీనిపై కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయని అన్నారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్తామని తెలిపారు. బీసీల రాజకీయ అవకాశాలను కాపాడుటకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు ఆర్థిక సాధికారత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

**సంపద సృష్టికి మూలధన వ్యయం**

పేదలకు రూ.52 వేల కోట్లు విలువైన నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చినట్లు చంద్రబాబు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దామని, మరో ఐదు లక్షల మందిని కూడా వ్యాపారవేత్తలుగా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.
పట్టణ ప్రాంతాల్లో రూ.50 వేల కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.11 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. హంద్రీ నీవా తొలి దశ పనులు పూర్తి చేసి కుప్పం వరకు నీటిని తీసుకొచ్చామని, వెలిగొండ తొలి దశ పూర్తి చేసి మార్కాపురం వరకు కృష్ణా జలాలను అందించినట్లు చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను తరలించే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.
రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ ఉద్యానవన కేంద్రంగా



అభివృద్ధి చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాల్లో రూ.లక్ష కోట్లు పెట్టుబడులతో ఉద్యాన రంగాన్ని అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఉద్యాన పంటలతో పాటు రవాణా, పర్యాటక రంగాల్లోనూ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బాపట్లలోని సూర్యలంకను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

**జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం**

ప్రతి నెలా మొదటి తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నానని చంద్రబాబు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భూమి సమస్యల పరిష్కారానికి 'మీ భూమి మీ హక్కు', పర్యావరణ పరిరక్షణకు 'స్వచ్ఛాంధ్ర', ప్రజల ఆరోగ్య పరిరక్షణకు 'సంజీవని' కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. పింఛన్ల కోసం ఇప్పటివరకు రూ.76 వేల కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం తెలిపారు. పేదరికాన్ని కేవలం ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో చూడాల్సిన అవసరం ఉందన్నారు.
భూ వివాదాల పరిష్కారానికి రీసర్వే 2.0ను అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ రికార్డుల భద్రతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లు పూర్తి చేసి పేదలకు అందించామని, మరో 5.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వాచ్‌మన్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సామాజిక మార్పులో సమయం వృథా చేయకుండా నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని యువతకు సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా పనిచేస్తున్నామని, సమాజంలో చివరి వ్యక్తి జీవన ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, నేతలు మోపిదేవి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ స్మిత్



న్యూఢిల్లీ,
దుబాయ్ నుండి ఫ్లై అల్జీరియా బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానంలో తలెత్తిన అత్యంత ప్రమాదకర దుర్ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ తన ప్రాణాల కంటే విమానంలోని వారి భద్రతకే ప్రాధాన్యం ఇచ్చిన ఆయనను భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలువురు ప్రపంచ నాయకులు "హీరో"గా అభివర్ణించారు. విమానంలో జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండటంతో దాడి వెనుక చేతులపై ఇంకా అధికారిక స్పష్టత వెలువడలేదు.
'భారత్ గర్విస్తోంది'.. మోడీ
ప్రధాని నరేంద్ర మోడీ స్మిత్ను ప్రత్యేకంగా ప్రశంసించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో, తీవ్రంగా గాయపడినప్పటికీ ఆందోళన చెందకుండా ప్రయాణికులను కాపాడేందుకు అత్యున్నత ప్రొఫెషనలిజంను ప్రదర్శించారని కొనియాడారు. "స్మిత్ ధైర్యం వందల మంది ప్రాణాలను కాపాడటంతో పాటు భారీ విపత్తును నివారించింది" అని పేర్కొన్నారు. "కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఒక హీరో, భారత్ ఆయనను చూసి గర్విస్తోంది" అని పేర్కొన్నారు. స్మిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన భార్య, తల్లిదండ్రులతోనూ ప్రధాని మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలోనూ మోడీ ఈ ఘటనను ప్రస్తావించారు. ఒక భారతీయుడు అత్యంత భారీ ఆకాశ విపత్తును నివారించడంలో కీలక పాత్ర పోషించాడని పేర్కొన్నారు.
నెతన్యాహు సెల్యూట్
ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్మిత్ను "నిజమైన హీరో"గా అభివర్ణించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన ప్రశాంతంగా కాక్పిట్ తలుపు తెరవడం వల్ల ప్రయాణికులు, సిబ్బంది జోక్యం చేసుకోవడానికి అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఆయన చర్య భారీ ఆకాశ విపత్తును నివారించిందని ప్రశంసించారు. స్మిత్ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ సామాజిక మాధ్యమాల్లో అతడి పేరు మారుమోగుతోంది. స్మిత్ మచ్చర్.. అతనొక నిజమైన హీరో... అంటూ వేలాది మంది కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ పైలట్ చిత్రాలను పంచుకుంటూ ఆయన ధైర్యాన్ని కొనియాడారు.
వాషింగ్టన్ నుంచి ట్రంప్ ప్రశంస
స్మిత్ సాహసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టిని ఆకర్షించింది. వైట్హౌస్లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ స్మిత్ను "హీరో"గా అభివర్ణించారు. తీవ్రంగా గాయపడిన స్థితిలోనూ కాక్పిట్ తలుపు తెరిచి సహాయం కోరగిన ఆయన సమయస్ఫూర్తిని ప్రశంసించారు. ఘటనకు సంబంధించిన వివరాలను నెతన్యాహు తదితరుల నుంచి తెలుసుకున్నానని చెప్పారు. దీంతో స్మిత్ సాహసాన్ని ప్రశంసించిన ప్రపంచ నాయకుల జాబితాలో భారత ప్రధాని మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా చేరారు.
'దేశం గర్విస్తోంది'.. రాష్ట్రపతి ముర్ము
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన అసాధారణ సాహసం, సమయస్ఫూర్తి దేశ ప్రజలను కదిలించాయని, దేశం ఆయనను చూసి గర్విస్తోందని పేర్కొన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ స్మిత్ను "అసాధారణ హీరో"గా అభివర్ణించారు. తీవ్ర గాయాల మధ్య ఆయన తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను ప్రశంసించారు. లోక్సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఆయనను నిజమైన హీరోగా కొనియాడారు.

# అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

(మొదటి తరువాయి)

గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్ - బీఆర్ఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడానికి "సడక్ సే సదన్ తక్" కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో అమిత్ షా కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ కాలేజ్ లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా అమిత్ షా పర్యటన సాగనుందని పార్టీ నేతలు చెబుతున్నారు. అమిత్ షా పర్యటన ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని వ్యూహం సిద్ధం చేస్తున్నారు.

# స్థానిక పోరుకు గ్రీన్ సిగ్నల్



ఏపీ బ్యూరో:
ఆంధ్రప్రదేశ్‌లో లోకల్ 'పోరు'కు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గురువారం కీలక తీర్పు ఇచ్చింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పంచాయతీరాజ్, పురపాలక శాఖలు జారీ చేసిన 105, 1065 జీవోలను హైకోర్టు కొట్టివేసింది. అదే సమయంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలను అనుమతిస్తూ.. ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ)ను ఆదేశిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలతో ముడిపడి ఉన్న వ్యాజ్యాలపై కొద్ది రోజుల కిందట విచారణ పూర్తి చేసిన హైకోర్టు తీర్పులను రిజర్వు చేసింది. ఎన్నికల నిర్వహణపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్న తరుణంలో గురువారం ఆయా వ్యాజ్యాలపై హైకోర్టు తీర్పును వెలువరించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 105, 1065 జీవోలను జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ప్రభుత్వం తరఫున స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ సమర్థిస్తూ వాదనలు వినిపించగా, సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమంటూ పిల్ దాఖలు చేసిన వారి తరఫున న్యాయవాదులు వాదించారు. ఇరువర్గాల వాదనలను విన్న న్యాయమూర్తులు రిజర్వేషన్ శాతం 50కి మించకుండా చూడాలంటూ ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది.

## పేదింటి ఆడబిడ్డలకు
# అండగా కళ్యాణలక్ష్మి



**మిడ్జిల్, అక్టోబర్ 1, ( నేటి దర్శిని )**
మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మిడ్జిల్ మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు బోల్గం నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు

# పేదింటి ఆడబిడ్డలకు భరోసా..
## వైద్యం కోసం ఆర్థిక చేయూత





**మిడ్జిల్,అక్టోబర్ 1, ( నేటి దర్శిని )**
మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కళ్యాణలక్ష్మి పథకం కింద 35 మంది లబ్ధిదారులకు రూ.1,00,116 చొప్పున చెక్కులు అందజేశారు. అలాగే అనారోగ్యంతో వైద్య చికిత్స పొందిన 17 మందికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జడ్చర్ల మార్కెట్ చైర్మన్ టీ.జ్యోతి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.డి. గౌస్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్, ఆర్ఐలు అంబిక, మాధవి, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, వివిధ గ్రామాల వార్డు నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురంలో వైసీపీ నుండి జనసేనలోకి చేరికలు, పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ, అక్టోబర్ 1, ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల బాబు అధ్యక్షతన జనసేన పార్టీ నాయకులు, పెద్దాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో, పెద్దాపురంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని వైసీపీ నుండి జనసేన పార్టీలోకి నూతనంగా చేరుతున్న శ్రేణులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన కాకినాడ గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు పంతం నానాజీ, కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు పెండెం దొరబాబు.పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేస్తూ కూటమి ప్రభుత్వాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు.

# 'స్థిరపడిన'వారు 'పేదల'కు తమ వంతు 'సహాయ సహకారాలు' అందించాలి

**- జిల్లా కలెక్టర్ పి.రాజబాబు**







**మద్దిపాడు,అక్టోబర్ 1, ( నేటి దర్శిని )**
పి4 కార్యక్రమం ద్వారా సమాజంలో అసమానతలు తొలగించే విధంగా అన్ని రకాలుగా స్థిరపడినవారు పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పి.రాజబాబు పేర్కొన్నారు. గురువారం చాకలి పాలెం, మద్దిపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను స్థానిక శాసన సభ్యులు విజయ కుమార్ తో కలిసి కలెక్టర్ పి.రాజాబాబు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పేదల సేవలో 2.0 కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్జీ దారుల నుండి సుమారు 82 అర్జీలను స్వీకరించారు.

**అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..**
గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల అవసరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి నెలా మొదటి తారీకు లేదా మొదటి తారీకు ప్రభుత్వ సెలవు దినం అయితే ముందు రోజు గానే పింఛన్లు పంపిణీ తో పాటు ప్రజా సేవలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రజా సేవలో కార్యక్రమం ఇక్కడి నుంచే మొదలుపెట్టడం జరిగింది అన్నారు. ఇందులో భాగంగా సంక్షేమ శాఖల అధికారులు ఆయా శాఖల అభివృద్ధి పథకాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. గ్రామం తద్వారా మండలం రాష్ట్ర అభివృద్ధి జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జిల్లా మొత్తం మీద సుమారు రెండు లక్షల పదహారు వేల మందికి 94 కోట్ల మేర పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. వి బి జి రాంజీ కార్యక్రమం కింద 100 కోట్ల నిధులు నుండి 140 కోట్ల వరకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామాలకు లింకు రోడ్లు ఏర్పాటు చేయడం ద్వారా భూముల విలువలు పెరగడంతోపాటు అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ నియోజకవర్గంలో మూడు ప్రజా సమస్యల పరిష్కార వేదికల కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సమాజంలో బాగా పలు రకాలుగా ఎదిగిన వారు నేను కూడా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్కొన్నారని ఆయన ఈ సందర్భంగా తెలియజేస్తూ పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలని ఆయన కోరారు. పేదలకు చేసే సహాయం ఏదైనాను విద్య ,ఆర్థిక ఇతరములు సంబంధించి ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

**స్థానిక శాసనసభ్యులు బి. ఎన్. విజయ్ కుమార్ మాట్లాడుతూ..**
రాష్ట్ర ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం అభివృద్ధి సంక్షేమమని దాని ఫలితాలు ప్రతి పేదవానికి అందాలని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రహదారులు విస్తరణకై 20 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ మొత్తం మీద 110 కోట్ల మేర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సర్వీస్ రోడ్లు తారు రోడ్లు రోడ్లు ఏర్పాటు చేయుట ద్వారా రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరిగిందని భూముల విలువలు పెరిగాయని ఆయన అన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా 40 కోట్ల మేర సంవత్సరానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా చాలామంది పేదలకు వేదిక వచ్చిన నిమిత్తం నిధులు అందించడం జరిగిందన్నారు. ఆర్థికంగా ఎదిగిన వారు సమ సమాజ స్థాపన కోసం పేదలకు వితౌదికంగా తమ వంతు సహాయ సహకారాలు అందించినప్పుడు మనస్శాంతిగా ఉంటుందని ఆయన అన్నారు. తనవంతుగా స్మశాన వాటిక మరియు పేదల ఇంటి వసతి కోసం మూడు ఎకరాల స్థలాన్ని ఇవ్వడం జరుగుతున్నదని, అదేవిధంగా స్మశాన వాటిక ఏర్పాటు జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మండల ప్రత్యేక అధికారి మాధురి, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వరరావు, డిపిఓ అనుపమ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ స్థానిక శాసనసభ్యులు తో కలిసి సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కోనసీమ
# ముద్దుబిడ్డ జీఎంసీ బాలయోగి

**బాలయోగి 75వ జయంతి వేడుకలలో పాల్గొన్న శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, అక్టోబర్ 1, ( నేటి దర్శిని ):**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కోనసీమ ముద్దుబిడ్డ జీఎంసీ బాలయోగి అని, భారత పార్లమెంటరీ వ్యవస్థలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు, లోక్‌సభ మాజీ స్పీకర్ స్వర్గీయ గంటి మోహనచంద్ర బాలయోగి అని కాకినాడ పట్టణ అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.జిఎంసి బాలయోగి 75 వ జయంతి సందర్భంగా జగన్నాధపురం, యానాం రోడ్ లో గల బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఒక సామాన్య దళిత రైతు కుటుంబంలో జన్మించిన బాలయోగి, తన నిష్పక్షపాత వైఖరి, హుందాతనంతో దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవులలో ఒకటైన లోక్‌సభ స్పీకర్ పదవిని అధిరోహించారని, 12, 13వ లోక్‌సభల సభాపతిగా క్లిష్ట పరిస్థితుల్లోనూ సభను సమర్థవంతంగా నడిపి, పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేశారని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యా, సామాజిక వికాసానికి బాలయోగి గారు ఎనలేని కృషి చేశారని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధికి, రైల్వే లైన్ల మంజూరుకు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయిని, అతి పిన్న వయస్సులోనే లోక్‌సభ స్పీకర్ బాధ్యతలు చేపట్టి, జాతీయ రాజకీయాల్లో తెలుగువారి కీర్తిని దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి అయిన బాలయోగి మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, రాజకీయ విలువలు నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి సంక్షేమ సంఘ అధ్యక్షులు బొడ్డు దేవరాజు, అంబటి చిన్న, సబ్బతి పణేశ్వరరావు, గొరుసు వెంకట దుర్గారావు, గంటి సత్తిబాబు, ఆకుల జాన్ వెస్లీ, గెద్దం పూర్ణ చంద్రశేఖర్, బొడ్డు శివాజీ, చింతపల్లి తాతారావు, అంగాడి దుర్గారావు, గంజి గోపి, తదితరులు పాల్గొన్నారు.

# గురుకులం విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

**-విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలి -జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత**



**మార్కాపురం,అక్టోబర్ 1, ( నేటి దర్శిని )**
మార్కాపురం మండలం రాయవరంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం ఉన్నత పాఠశాల, కళాశాలలో గురువారం రాత్రి విద్యార్థులకు పరుపుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పాల్గొని విద్యార్థులకు పరుపులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు క్రమశిక్షణతో, పట్టుదలతో కష్టపడి పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.మంచి మార్కులు సాధిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

**ఇంటర్ విద్యార్థులు టెన్త్ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి**
ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని తెలిపారు.భవిష్యత్తులో పైలట్లు, శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, ఎస్పీలు, ఆస్ట్రోనాట్స్ వంటి ఉన్నత స్థానాలను అధిరోహించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఇతర గురుకుల పాఠశాల, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దిన పత్రిక PRGI NO:APTEL/26/A5450 WWW.NETIDARSHINI.COM

# ఓటీటీలోకి వచ్చేసిన కార్తీ 'సర్దార్ 2'




కార్తీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'సర్దార్ 2' ఎట్టకేలకు డిజిటల్ మాధ్యమంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఈ సినిమా ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో లో అధికారికంగా స్ట్రీమింగ్ అవుతోంది. మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ రెండవ భాగంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా విడుదలై నెగిటివ్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయాన్ని అందుకుంది. ఇక దర్శకుడు పి.ఎస్. మిత్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరో కార్తీ మరోసారి ద్విపాత్రాభినయంతో అదరగొట్టారు.ఇక ఈ చిత్రంలో విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ పాత్రలో కనిపించగా, మాళవిక మోహనన్ , ఆషికా రంగనాథ్ , రజీషా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.

# రెండు పార్టులుగా అల్లు అర్జున్ 'రాకా'?




పాన్-ఇండియా స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ 'రాకా' చుట్టూ ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో భారీ చర్చ నడుస్తోంది. మాస్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ సైన్స్ ఫిక్షన్, యాక్షన్ థ్రిల్లర్‌ను ఒకే పార్టుగా కాకుండా ఏకంగా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన కథా పరిధి ఊహకందనంత పెద్దదిగా ఉండటంతో పాటు, విభిన్న టైమ్‌లైన్స్ మరియు మల్టిపుల్ గెటప్స్‌తో కూడిన ఒక గ్లోబల్ వరల్డ్‌ను ఈ చిత్రంలో డైరెక్టర్ ఆవిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ డిమాండ్ చేస్తున్న విశాలమైన నేపథ్యానికి పూర్తి న్యాయం చేయాలంటే, ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా విభజించడమే సరైన మార్గమని చిత్ర యూనిట్ భావిస్తోందట. ఒకవేళ ఈ ప్లాన్ కనుక పక్కా అయితే, ఈ విజువల్ వండర్ మూవీకి సంబంధించిన మొదటి పార్టు డిసెంబర్ 2027లో విడుదలయ్యే అవకాశం ఉందని, రెండో పార్టు 2028లో థియేటర్లలోకి వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అయితే దీనిపై సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.






# యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి' ట్రైలర్ విడుదల..

**-నవ్వులు పంచుతూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హర్రర్-కామెడీ!**




బాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా హర్రర్-కామెడీ 'నైయ్ నవెల్లి' . తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. బాలీవుడ్ హీరోయిన్ యామి గౌతమ్ ధర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగానో అలరించనుంది. ఇక ఈ సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ, సినీ వర్గాల్లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రంలో యామి గౌతమ్ సరసన ఆదినాథ్ కోఠారే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ , హిమాన్షు శర్మ సంయుక్తంగా కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ మరియు అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మరోవైపు, ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే.. ఎంతో అస్తవ్యస్తంగా, గందరగోళంగా ఉన్న ఒక సాధారణ కుటుంబంలోకి యామి గౌతమ్ కొత్త కోడలిగా ప్రవేశించడంతో కథ అసలు మలుపు తిరుగుతుంది. ఆమె ఇంట్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆ కుటుంబంలోని అందరి జీవితాల్లో అనూహ్య మార్పులు వచ్చి, ప్రశాంతత చేకూరుతుంది. అయితే, ఆ ఇంట్లోని మరిది పాత్రలో నటిస్తున్న ఆదినాథ్‌కు ఆ కొత్త కోడలు ప్రవర్తన మరియు ఆమె పద్ధతుల మీద అనుమానం కలుగుతుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కోడలు నిజంగానే ఆ కుటుంబానికి దేవతలాంటి మనిషా లేక ఆమె వెనుక మరేదైనా దెయ్యం లేదా అంతుచిక్కని రహస్యం దాగుందా అనే కోణంలో ఈ ట్రైలర్ చాలా ఉత్కంఠభరితంగా, నవ్వులు పూయిస్తూనే వెన్నులో వణుకు పుట్టించేలా సాగుతుంది. హర్రర్ మరియు కామెడీని చాలా చక్కగా మిక్స్ చేసి తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 16వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# ముంబైకి మకాం మార్చిన కల్యాణి ప్రియదర్శన్

దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును సంపాదించుకుంది కల్యాణి ప్రియదర్శన్. ముఖ్యంగా గత ఏడాది విడుదలైన 'లోక ఛాప్టర్-1' చిత్రం ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ నేపథ్యంలో ఆమె 'ప్రళయ్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో జాంబీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూనే రణ్‌వీర్‌సింగ్ సరసన నటించే లక్కీఛాన్స్‌ను దక్కించుకోవడంతో ఈ సొగసరి ఆనందానికి అవధులులేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం ఆమె లుక్, ఫిట్‌నెస్, యాక్షన్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నది. అందులో భాగంగా ముంబయికి మకాం మార్చి సినిమా పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని నిర్ణయించుకుందట. ముఖ్యంగా యాక్షన్ ఘట్టాల కోసం గత మూడు నెలలుగా స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదట. రణ్‌వీర్‌సింగ్‌తో కలిసి వర్క్‌షాప్స్, రిహార్సల్స్‌లో పాల్గొంటూ బిజీగా గడుపుతున్నదీ భామ. ఈ సినిమా ద్వారా బాలీవుడ్‌లో బ్రేక్ సాధించి ఉత్తరాదిన కూడా తన ఇమేజ్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో కల్యాణి ప్రియదర్శన్ ఉందని చెబుతున్నారు. 'ప్రళయ్' చిత్రం అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# రానా సమర్పణలో కార్తీక్ సుబ్బరాజు గే లవ్‌స్టోరీ 'డోరతీ'

**-తెలుగు ట్రైలర్ రిలీజ్**




కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త బోల్డ్ అండ్ ఎమోషనల్ డ్రామా చిత్రం 'డోరతీ' . ఆస్కార్ అవార్డు విజేత గునీత్ మోంగా నిర్మించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్ టైటిల్ రోల్ పోషించగా, సనంత్, రిషికాంత్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవలే తమిళ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తాజాగా తెలుగులోకి రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటికి చెందిన 'స్పిరిట్ మీడియా' సంస్థ ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సమాజంలోని పక్షపాతాలు, లింగ సమానత్వం, LGBTQIA+ మరియు జెండర్ రాజకీయాల చుట్టూ తిరిగే విభిన్నమైన, ధైర్యమైన కథాంశాన్ని కార్తీక్ సుబ్బరాజు ఆవిష్కరించారు. టొరంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ప్రశంసలు పొందిన ఈ చిత్రానికి మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించడం విశేషం.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450